


కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :189 | శుక్రవారం 11 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

# 50 ఏళ్లుగా కాంగ్రెస్‌వి అబద్ధాలు, మోసాలే..

●కాళేశ్వరం కమిషన్‌కు పూర్తి సమాచారం ఇచ్చాం - ప్రభుత్వమే నిజాలు దాచి ఉంచింది ●మేడిగడ్డ-సుందీళ్ల ఆరు సార్లు కేబినెట్ ఆమోదం పొందిన ప్రాజెక్టులే ● కృష్ణా నీళ్లపై 299 టీఎంసీల కేటాయింపు కాంగ్రెస్ నేతల చేతకానితనమే ●రేవంత్ రెడ్డి ఇచ్చింది పవర్ పాయింట్ కాదు.. కవర్ పాయింట్ ప్రజెంటేషన్ ● నీటి విషయంలో కేసీఆర్ శాశ్వత ఒప్పందం చేసి ఉంటే.. సెక్షన్-3 గురించి ట్రైబ్యూనల్‌కి లేఖ ఎందుకు రాస్తారు ? ●కాంగ్రెస్ అబద్ధాల పార్టీ, నీళ్ల విషయంలో ఆ పార్టీ చేసిన పాపాలు మర్చిపోరాదు ●కాళేశ్వరం వ్యవహారంలో మేం ఆమోదించిన డాక్యుమెంట్లన్నీ అందించాం: హరీశ్ రావు




న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్): రాష్ట్రంలో గత 50 ఏళ్లుగా కాగ్రెస్ పార్టీవి అబద్ధాలు, మోసాలేనని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. జస్టిస్ పి చంద్రఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్‌ను కలిసేందుకు ఆయన ఇవాళ బీఆర్కే భవన్‌కు వెళ్లారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి అదనపు సమాచారాన్ని కమిషన్ చైర్మన్ జస్టిస్ పి చంద్రఘోష్‌కు అందజేశారు. అనంతరం బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డ, అన్నారం, సుందీళ్ల ప్రాజెక్టులు ఆరు సార్లు కేబినెట్ ఆమోదం పొందాయని తెలిపారు. అదేవిధంగా అసెంబ్లీలోనూ మూడు సార్లు ఆమోదం పొందాయని గుర్తు చేశారు. అందుకు సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లు కమిషన్‌కు అందజేశానని తెలిపారు. ఇంతకు మించిన వివరాలు కూడా ప్రభుత్వం వద్దే ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం ఏమేం దాచిపెట్టిందో తమకు పూర్తి తెలుసని పేర్కొన్నారు. కాళేశ్వరంపై మా హయాంలో జరిగిన కేబినెట్ నోట్, డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన సమాచారం కావాలని చీఫ్ సెక్రటరీకి, జీఏడీ సెక్రటరీకి, ఇరిగేషన్ సెక్రటరీలకు లేఖ రాశానని.. కానీ వారి నుంచి స్పందన రావడం లేదని హరీశ్‌రావు తెలిపారు

## మా పనికి ఆమె క్రెడిట్ తీసుకోవడమేంటి



●బీసీ రిజర్వేషన్లకు కవితకు ఏమాత్రం సంబంధం లేదు ●మా పోరాటం ఫలితమే బీసీలకు 42% రిజర్వేషన్లు ●కవిత కౌన్ కిస్కా హై? ●సామాజిక న్యాయం కాంగ్రెస్‌దే, రిజర్వేషన్ల వెనుక రాహుల్ &ఖర్గే ఆశయం ●బీఆర్ఎస్, బీజేపీకి బీసీ రిజర్వేషన్లతో సంబంధమే లేదు: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మండిపాటు

## ఎక్కువమంది పిల్లల్ని కంటేనే నిజమైన దేశభక్తి



●జనాభా నియంత్రణ కాదు, నిర్వహణే అవసరం ●జనాభా నియంత్రణను ప్రోత్సహించి నష్టపోయాం ●జనాభా పెరుగుదల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి ●చైనా తప్పు చేసింది.. మనం నేర్చుకోవాలి ●ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తాం సీఎం చంద్రబాబు

## రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్



న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్): తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది.. ఈ క్రమంలోనే.. రేవంత్ సర్కార్.. కొత్తగా మంజూరైన వారికి రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్ చేసింది. ఈ నెల 14న తుంగతుర్తిలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

## అదే జరిగితే అల్లకల్లోలమే - ఆర్.కృష్ణయ్య హెచ్చరిక



న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బీసీల విజయంగా భావిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. 70 ఏళ్లకు పైగా బీసీ రిజర్వేషన్ల విషయంలో తమకు అన్యాయం జరుగుతూనే ఉందని ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రభుత్వం అడుగడుగునా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రాజాసింగ్ రాజీనామాను ఆమోదించిన అధిష్టానం

నా చివరి శ్వాస వరకు హిందుత్వం కోసం పని చేస్తూనే ఉంటాను - రాజా సింగ్



న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):గోషామాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను శుక్రవారం ఆ పార్టీ అధిష్టానం ఆమోదించింది. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు రాజాసింగ్ రాజీనామాను ఆమోదించామని, ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటన విడుదల చేశారు. రాజీనామా ఆమోదంపై రాజాసింగ్ స్పందించారు. ఈ మేరకు వీడియో విడుదల చేశారు. 11 ఏళ్లుగా బీజేపీలో కొనసాగాను. నన్ను నమ్మి పార్టీ మూడుసార్లు టికెట్ ఇచ్చింది. ఇన్ని రోజులు నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు.

## త్వరలోనే రోహిత్ వేముల చట్టం

●రామచందర్ రావుకి బీజేపీ తెలంగాణ అధ్యక్ష పదవా.? ● రోహిత్ వేముల ఆత్మహత్యలో ప్రమేయం ఉన్నవారికి ప్రమోషన్‌లు ఎందుకు? - డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు నియామకాన్ని పునరాలోచన చేయాలని సంచలన వ్యాఖ్యలు చేశారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. దళితులు, గిరిజనులను వేధించిన వారికి బీజేపీ ఉన్నత పదవులు ఇస్తుందనే దానికి తెలంగాణ అధ్యక్షుడిగా రామచందర్ రావు నియామకమే ఉదాహరణ అంటూ భట్టి విమర్శలు చేశారు.

## హిందీని ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం..



●హిందీ అంటే భయపడే అవసరం లేదు, రాజకీయాలకోసం వ్యతిరేకించొద్దు ● మాతృభాష అమ్మ అయితే, హిందీ పెద్దమ్మ ●హిందీని వ్యతిరేకించడం భావితరాల అభివృద్ధికి అడ్డుకాదు? : హిందీ దివస్ లో పవన్ కల్యాణ్

## భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలి : మంత్రి శ్రీధర్‌బాబు



న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల వంటి ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని సివిల్ ఇంజినీర్లను కోరారు.

## బీజేపీ రామచంద్రా నోరు తెరవరేం?

●ఈవోపై దాడి.. బీజేపీ మౌనంపై కేటీఆర్ ఫైర్ ●రాములోరి భూములు ఎవరివి అయ్యాయో? ●రామజపం ఓట్ల కోసమేనా? ఆక్రమణలపై స్పందించండి - కేటీఆర్



న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి దేవస్థాన భూముల్లో జరుగుతున్న ఆక్రమణలను, పక్కా భవన నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ కార్యనిర్వహణ అధికారిణి (ఈవో)పైనా, 30 మంది సిబ్బందిపైనా ఆ గ్రామస్తులు మంగళవారం కర్రలతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. భద్రాద్రి ఆలయ ఈవోపై దాడి జరిగిన ఘటనపై బీజేపీ రాచమంద్రా నోరు తెరవరేం..? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాములోరి భూములను ఆక్రమించుకుంటోంటే మాటైనా మాట్లాడరేం? మీ భాగస్వామి ప్రభుత్వం చెరలో ఉన్నాయని వదిలేస్తున్నారా? లేక ఈసారి మొత్తం భద్రాద్రినే గంపగుత్తగా వారి చేతిలో పెడదామనుకుంటున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

## జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల సమస్యను పరిష్కరించండి

కొత్త కలెక్టర్ కు విన్నవించిన ఖమ్మం జర్నలిస్టులు
సానుకులంగా స్పందించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశేట్టి
ఎంపి రేణుకచౌదరి,జిల్లాఇంచార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డిలకు కూడా మొరపెట్టుకున్న జర్నలిస్టులు



ఖమ్మం బ్యూరో, 11 జులై (కెరటం న్యూస్): సదీర్ఘంగా పెండింగ్ లో ఉన్నఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఖమ్మం నగరంలోని పలువురు జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశేట్టిని కలిసి విన్నవించారు. కొత్తగా జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఖమ్మం సెగ్మెంట్లో పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ళ సమస్యపై కలెక్టర్ కు మెమోరాండంను సమర్పించారు.గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హాయంలో ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల , రఘునాధపాలేం మండలం వివెకంటాయపాలేం రెవెన్యూగ్రామాల పరిధిలో పలు సర్వే నెంబర్లో 23.02 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని జర్నలిస్టులకు కేటాయించిందని దీనికి అప్పటి ప్రభుత్వ క్యాబినెట్ అమోద ముద్ర వేసిన తరువాత ప్రభుత్వం జీవో నూ కూడా జరిచేసిందని ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో అప్పట్లో ఆ పక్రియ నిలిచిపోయిందని కలెక్టర్ కు వివరించారు.

## 50 ఏళ్లుగా కాంగ్రెస్‌వి అబద్ధాలు, మోసాలే..

కృష్ణా నీళ్లలో 299 టీఎంసీల కేటాయింపు కాంగ్రెస్ పాపమే..

రాష్ట్రాలకు నీటి వినియోగాన్ని కేఆర్ఎంబీ చేస్తుందని, నీటి పంపకాన్ని ట్రైబ్యూనల్ చేస్తుందని అన్నారు. నీటి వినియోగం అనేది ఆ సంవత్సరానికి పరిమితమైన ఉంటుందని, నీటి పంపకం అనేది శాశ్వతమని విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తించాలని అన్నారు. తెలంగాణకు 299 టీఎంసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం సంతకాలు పెట్టిందని విషయం ప్రచారం కాంగ్రెస్ చేస్తోందని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి కాంగ్రెస్ పాలకులు కృష్ణా పరివాహక ప్రాంతంలో ఇదే జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాంటి చేతకాని నేతల వల్ల నాడు 299 టీఎంసీ నీరు మాత్రమే తెలంగాణ ప్రాజెక్టులు కేటాయించారని ఆరోపించారు.

ఒకవేళ నీళ్ల విషయంలో కేసీఆర్ శాశ్వత ఒప్పందం చేసి ఉంటే.. సెక్షన్-3 (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాలను పున: పంపిణీ) గురించి రాష్ట్రం ఏర్పడిన 42 రోజే ఎందుకు ట్రైబ్యూనల్‌కు లేఖ రాశారో కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు. తెలంగాణలో ఉన్న 62 శాతం నదీ పరివాహక ప్రాంతం ఆధారంగా నీళ్లు కేటాయించారని.. ఇది తమ హక్కు అని కేసీఆర్ ట్రైబ్యూనల్‌ను విజ్ఞప్తి చేసింది వాస్తవం కాదా అని అన్నారు. కృష్ణా నీళ్లలో 299 టీఎంసీల కేటాయింపు కాంగ్రెస్ పాపమేనని ఆరోపించారు. నిన్న సీఎం రేవంత్ రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే అని అన్నారు. గత 50 ఏళ్లుగా కాంగ్రెస్‌వి అబద్ధాలు, మోసాలేనని ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి ఇచ్చింది పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కాదని.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు 50 ఏళ్లుగా చేసిన మోసాలకు కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని సెటైర్లు వేశారు.

## హిందీని ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం..

**న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):** హిందీ భాషపై ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం.. బలవంతంగా.. రాష్ట్రాలపై హిందీని రుద్దే ప్రయత్నం చేస్తుందని ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి.. అయితే, ఈ తరుణంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. హైదరాబాద్‌లో నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొని హిందీ దివస్ శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. హిందీని ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అని వ్యాఖ్యానించారు.. మన దేశం వివిధ సంస్కృతులు ఉంటాయి.. అందరినీ హిందీ ఒక కామన్ భాషగా కలుపుతుందన్నారు.. విదేశస్తులు మన భాష నేర్చుకుంటారు.. మనం హిందీ అంటే ఎందుకు భయపడాలి..? అని ప్రశ్నించారు. హిందీ జబర్దస్త్ వస్తువు ఏమీ కాదు.. జర్మనీ, ఇతర భాషలు నేర్చుకుంటున్నాం.. కానీ, హిందీతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు..

హిందీ మనది అనడంలో సిగ్గు ఎందుకు..? హిందీ నీ ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అన్నారు పవన్ కల్యాణ్.. బెంగాలీ గీతం జాతీయ గీతం అయింది.. అబ్దుల్ కలాం మిస్సైల్ మన్ అయ్యారు.. దక్షిణ భారత దేశస్తుడు చేసిన జెండా భారత జెండా అయింది.. ప్రతీ భాష జీవ భాష.. రాష్ట్ర భాష హిందీ.. రాష్ట్ర భాష హిందీని స్వాగతిస్తున్నారు.. మాతృ భాష మన అమ్మ భాష అయితే.. పెద్దమ్మ భాష హిందీగా అభివర్ణించారు.. హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని పరిమితం చేయడమే అవుతుందన్నారు పవన్ కల్యాణ్.. ఉర్దూను, పర్షియన్ ను అంగీకరించి.. హిందీని వ్యతిరేకించడం అవివేకం అవుతుందన్‌ఆనరు.. 31 శాతం సినిమాలు హిందీ లో డబ్ అవుతున్నాయి.. వ్యాపారానికి హిందీ కావాలి.. కానీ, నేర్చుకోవడానికి అభ్యంతరం ఎందుకు? అని నిలదీశారు పవన్ కల్యాణ్..

## అదే జరిగితే అల్లకల్లోలమే ప్రభుత్వానికి ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

రిజర్వేషన్ల విషయంలో కోర్టుకు వెళ్తారని అక్కడ కొట్టేస్తారని కొంత మంది మాట్లాడుతున్నారు. కోర్టుకు వెళ్లినా వారి వాదన నిలబడదన్నారు. రాజకీయ, చట్ట, న్యాయ పరమైన అవరోధాలు ప్రభుత్వానికే లేవని రాజకీయంగా అసెంబ్లీలో బీసీ బిల్లును ఆమోదింస్తే చట్ట ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్రాలకే ఉందన్నారు. ఇక సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెడికేషన్ కమిషన్ ఏర్పాటుతో ఆ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయబోతున్నందునా ప్రభుత్వం వైపే బలం ఉందన్నారు.

టైమ్ వేస్ట్ చేయొద్దు:

తెలంగాణలోని అగ్రకులాల సోదరులు బీసీలకు రిజర్వేషన్ల విషయంలో సానుకూలంగా ఉన్నారని వారంతా తనకు ఫోన్ చేసి సపోర్టు చేస్తామని చెబుతున్నారని ఆర్.కృష్ణయ్య చెప్పారు. బీసీలు సర్పంచ్ లు, ఎంపీటీసీలు అయితే తమకు సంతోషమే అని చెబుతున్నారని అన్నారు. ఎవరైనా కోర్టుకు పోయినా వారిని అడ్డుకుంటామని చెబుతున్నారని వెల్లడించారు. రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వానికే సానుకూలత ఉన్నందున సమయం వృథా చేయకుండా ఎన్నికలకు వెళ్లాలని సూచించారు.

ఏదైనా జరిగితే అల్లకల్లోలమే:

అన్ని అనుకూలతను ఉన్నా ఏదైనా ఆటంకం ఏర్పడితే బీసీలంతా తిరగబడతారని హెచ్చరించారు. మండల్ కమిషన్, ఎన్టీఆర్ రిజర్వేషన్లు పెంచిన సమయంలో సమాజంలో అల్లకల్లోలం రేగిందని అటువంటి పరిస్థితి రావొద్దని అన్నారు. జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి రావాలనే మేము అడిగుతున్నామని ఎవరిని శత్రువులుగా చూడటం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కేసులు వేసినా ముందుగా ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చాకే ఆ పటిషన్లపై విచారణ జరిపేలా హైకోర్టు, సుప్రింకోర్టులో ప్రభుత్వం కేవియట్ పిటిషన్ ను దాఖలు చేయాలని డిమాండ్ శారు.

## భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలి: మంత్రి శ్రీధర్‌బాబు



**న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల వంటి ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని, ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని సివిల్ ఇంజినీర్లను కోరారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్, హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో "నెక్ట్-జెన్ హై-రైజ్ బిల్డింగ్స్" అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును మంత్రి శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చిందని చెప్పారు. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200పైగానే ఉన్నాయని, మరో 250 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో పర్యావరణానికి పెద్దపీట వేయాలని సూచించారు. కాంపోజిట్ స్టీల్ హై-రైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌తో కలిసి పని చేస్తామన్నారు. సంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు హామీ ఇచ్చారు.

## జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల సమస్యను పరిష్కరించండి

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్న జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వడం లేదని పలువురు జర్నలిస్టులు తమ అవేదనను కలెక్టర్ కు వివరించారు. హైద్రాబాద్ నగరంలోని జవహార్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సోసైటికి సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే దానిని కూడా ఖమ్మం జర్నలిస్టు హౌజింగ్ సోసైటికి అనువయించి ఒక సాకుగా చూపిస్తూ పెండింగ్ లో పెట్టి నాన్చుతున్నారని, ఇది సి ఎం హామి క్రింద జారీ అయిన జివో కనుక మరోసారి మా సమస్యను పరిష్కరించి ఖమ్మం సెగ్మెంట్లో ని జర్నలిస్టులకు న్యాయం చేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వడానికి క్రషి చేస్తామని,ఫైల్ ను తెప్పించుకొని స్టడి చేస్తానని హామి ఇచ్చారు. న్యాయపరమైన అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటా మన్నారు.

రేణుకచౌదరి, వంశీచంద్ రెడ్డిలకు కూడా జర్నలిస్టుల వినతిపత్రాలు

ఖమ్మం అసెంబ్లీ నియోకవర్గంలోని జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల సమస్యపై శుక్రవారం ఖమ్మం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం లో రాజ్యసభ సభ్యురాలురేణుకచౌదరి,ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీ చంద్ రెడ్డి లను కూడా ఖమ్మం జర్నలిస్టులు కలిసి వినతిపత్రాలను అందజేశారు.కాంగ్రెస్ మ్యానిఫెస్టో లో కూడా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందిస్తామనే హామి ఇచ్చారని,గత ప్రభుత్వం జారీచేసిన జి వోను ప్రస్తుత ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వెంటనే ఈ సమస్యను పరిష్కరింప జేయాలని జర్నలిస్టులు రేణుకచౌదరికి, వంశీచంద్ రెడ్డి లకు విన్నవించారు దీనికి తీవ్రంగా స్పందించి ఇరువురు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిలన్నింటిని ఒక్కొక్కటికి నెరవేర్చుకుంటూ వస్తున్నామని, జర్నలిస్టుల ఇళ్ళ సమస్యను కూడా త్వరగా పరిష్కారం అయ్యేందుకు శాయశక్తులా క్రషి చేస్తామని హామి ఇచ్చారు. పై కార్యక్రమంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) ఖమ్మం జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వర్ రావు, స్ధంభాద్రి జర్నలిస్టుల హౌజింగ్ సోసైటి అధ్యక్షులు కనకం సైదులు, టిజెఎఫ్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ నల్లజాల వెంకట్రావ్ ,టియుడబ్ల్యుజె (ఐజెయు)నగర అధ్యక్ష కార్యదర్శులు మైసాపాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు మామిడాల భూపాల్ రావు, వివిధ సంఘాల నాయకులు జనార్ధనాచారి, పసుపులేటి సత్యనారాయణ, కళ్యాణ్, హరీశ్ కొరికుప్పుల రాంబాబు, కళ్యాణ చక్రవర్తి, జగదీశ్, రవి, గోసుల నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మా పనికి ఆమె క్రెడిట్ తీసుకోవడమేంటి

**న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేబినెట్ తీసుకోవడం స్వాగతించ తగ్గ విషయం అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అని ఈ నిర్ణయం వెనుక ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆశయం ఉందన్నారు. శుక్రవారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సామాజిక న్యాయం కాంగ్రెస్ తో నే సాధ్యం అని మరోసారి నిరూపితమైందని బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే లోకల్ బాడీ ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. ఇది బీసీలకు ఓ సువర్ణావకాశం అని దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీసీ రిజర్వేషన్లను 21 శాతానికి తగ్గించిన గత పాలకులు ఇవాళ మేమేదో ఘన కార్యం చేసినట్లు చెప్పుకుంటున్నారని అలాంటి నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. బీసీ రిజర్వేషన్లకు బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ కవితకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. మేము బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే దానికి ఆమె క్రెడిట్ తీసుకోవడం ఏంటని మండిపడ్డారు. 'కవిత కౌన్ కిస్కా హై..' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పదేళ్లు ఏం వెలగబెట్టారని కవిత బీసీ పాట పాడుతున్నారు. బీసీ రిజర్వేషన్లు రాహుల్ గాంధీ అజెండా, రేవంత్ రెడ్డి నిబద్ధతో సాధ్యమైందన్నారు. కవిత మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. అధికారంలో ఉండగా ఒక్కరోజు బీసీల గురించి మాట్లాడని మీకు అధికారం పోగానే బీసీలు గుర్తుకు వచ్చారా? అడుగడుగునా బీసీలను అణగదొక్కిన బీఆర్ఎస్ అధినేత కూతురు మీరు అని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడమేనని ఇందులో బీఆర్ఎస్, బీజేపీలకు ఎలాంటి భాగస్వామ్యం లేదన్నారు.

## రాజాసింగ్ రాజీనామాను ఆమోదించిన అధిష్టానం

నా చివరి శ్వాస వరకూ హిందుత్వం, సనాతనధర్మం, జాతీయ వాదం కోసం పనిచేస్తా' అని రాజాసింగ్ ప్రకటన చేశారు. అయితే.. ఈ క్రమంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో చేరబోతున్నారంటూ వస్తున్న వార్తలపైనా రాజాసింగ్ స్పందించారు. దీనిపై మరో వీడియో రిలీజ్ చేశారు. 'రాజీనామా ఆమోదంపై కార్యకర్తలు బాధపడొద్దు. నా రాజీనామా కారణాలను అధిష్ఠానం పరిశీలించలేదు. కార్యకర్తల అభిప్రాయాన్ని ఢిల్లీకి తీసుకెళ్లలేకపోయాను. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో చేరుతానని ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకోలేదు. త్వరలో కార్యకర్తలతో చర్చించి నిర్ణయం తీసుకుంటా' అని రాజాసింగ్ ప్రకటించారు

## బీజేపీ రామచంద్రా నోరు తెరవరేం? : కేటీఆర్


**న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి దేవస్థాన భూముల్లో జరుగుతున్న ఆక్రమణలను, పక్కా భవన నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ కార్యనిర్వహణ అధికారిణి (ఈవో)పైనా, 30 మంది సిబ్బందిపైనా ఆ గ్రామస్తులు మంగళవారం కర్రలతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. భద్రాద్రి ఆలయ ఈవోపై దాడి జరిగిన ఘటనపై బీజేపీ రాచమంద్రా నోరు తెరవరేం..? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాములోరి భూములను ఆక్రమించుకుంటోంటే మాటైనా మాట్లాడరేం? మీ భాగస్వామి ప్రభుత్వం చెరలో ఉన్నాయని వదిలేస్తున్నారా? లేక ఈసారి మొత్తం భద్రాద్రినే గంపగుత్తగా వారి చేతిలో పెడదామనుకుంటున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఓట్ల కోసమే చేసే మీ రామజపాలను, సీట్ల కోసమే వేసే మీ దొంగ నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. మోదీతో మాట్లాడతారో, మీ దోస్తు దగ్గర మోకరిల్లుతారో మీ ఇష్టం.. భద్రాద్రిని కాపాడండి.. ఆక్రమణల చెర నుంచి విడిపించండి అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఆ ఒక్క మాటతో.. కేసీఆర్ క్రెడిబిలిటీ మొత్తం పోయింది - సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని

**న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):** అసెంబ్లీకి వచ్చి మీ భావాలు చెప్పండి అంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు సూచించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో అయితే కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ మాట్లాడొచ్చు.. ప్రభుత్వాన్ని విమర్శించొచ్చు అన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లు కాళేశ్వరానికి అన్ని తానే అని చెప్పుకున్న కేసీఆర్.. అధికారం కోల్పోగానే తనకు సంబంధం లేదని చెప్పడంతో కేసీఆర్ క్రెడిబిలిటీ మొత్తం పోయిందన్నారు. కేటీఆర్ ప్రెస్ క్లబ్ వెళ్లి కుర్చున్నారని, ప్రెస్ క్లబ్‌కు వెళ్లడం సమస్యను పక్కదారి పట్టించడమే అన్నారు. కాళేశ్వరం, బనకచర్ల రెండు సీరియస్ అంశాలే అన్నారు. ఈ రెండు అంశాలపై చర్చించేందుకు అసెంబ్లీకి ఎందుకు రారు అని ప్రశ్నించారు. ఈ రెండు అంశాలు న్యాయ వ్యవస్థ పరిధిలోకి వెళ్లాయన్నారు. అయినా బీఆర్ఎస్ నేతలు సవాల్ చేయడాలు.. కమిషన్ ఎదుట హాజరయ్యే ముందు వందల కార్లతో హడావుడి చేయడం ఎందుకని మండిపడ్డారు.

ఎవరు ఒప్పుకున్నా.. ఒప్పుకోకున్నా.. కాళేశ్వరం ఫెయిల్యూర్ ప్రాజెక్ట్ అన్నారు. నీటి వాటాలు తేలే వరకు బనకచర్ల ప్రాజెక్టు ఆపాల్సిందేనని కూనంనేని సాంబశివ రావు అన్నారు. మీ వాటా నీళ్లు మీరు తీసుకొంది, మా వాటా నీళ్లు మావి అని అన్నారు. జల సంఘం నీటి వాటాలు తేల్చాలన్నారు. నీటి వాటాలు తేలకుండానే ప్రాజెక్టులు కట్టడం కరెక్టు కాదన్నారు. భద్రచలంలో ఈఓపై దాడి జరిగిందన్నారు. ఈ ఐదు ఊర్లను తెలంగాణకు వదిలేయలన్నారు. చంద్రబాబు బాధ్యత తీసుకోవాలన్నారు. ఐదు గ్రామాలను వదిలేయలన్నారు. మీరు, మేము కలిసి ఉండొచ్చు అన్నారు.

## ఎక్కువమంది పిల్లల్ని కంటేనే నిజమైన దేశభక్తి : సీఎం చంద్రబాబు




**న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):** జనాభా నిర్వహణపై సంచలన వ్యాఖ్యలు చేశారు సీఎం చంద్రబాబు. అప్పట్లో జనాభా నియంత్రణను ప్రోత్సహించి నష్టపోయామని.. ఇప్పుడు జనాభా పెరుగుదల కోసం అందరు కృషి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ముగ్గురికంటే ఎక్కువమంది పిల్లల్ని కంటేనే నిజమైన దేశభక్తి ఉన్నట్లని అన్నారు చంద్రబాబు. ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తాం అని చెప్పి రూ.15 వేలు ఇస్తున్నామని.. జనాభా పెరుగుదల కోసం అందరు కృషి చేయాలని అన్నారు.

చైనా జనాభా నియంత్రణ వలన చాలా నష్ట పోయిందని.. జనాభా పెరుగుదల కోసం అందరం మాట్లాడాలని అన్నారు చంద్రబాబు. దక్షిణ భారత దేశంలో నియోజక వర్గాల సీట్లు తగ్గుతాయని ఆందోళన చెందుతున్నాయిని అన్నారు.దానికి కారణం జనాభా నియంత్రణ చర్యలేనని అన్నారు చంద్రబాబు. ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించే పథకాలు అమలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు.

తాను మహిళా పక్షపాతినని.. ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించారని, మహిళలకు ప్రత్యేకంగా మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేశారని అన్నారు. నా తల్లి కట్టెల పొయ్యి మీద అన్నం వండి ఇబ్బంది పడింది..అందుకే నా ఆడపడుచులకు ఉచిత గ్యాస్ సిలిండర్ లు ఇచ్చానని అన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు స్వయం సమృద్ధి సాధించారని అన్నారు.శక్తి సామర్థ్యాల్లో మహిళలలు ఏమాత్రం తక్కువ కాదని.. జనాభా లో 50 శాతం మహిళలు ఉన్నారని అన్నారు. ఆర్టీసీ బస్సులో కండక్టర్లుగా మహిళలకు రిజర్వేషన్లు కల్పించానని అన్నారు చంద్రబాబు.

ఒకప్పుడు జనాభా నియంత్రణ అన్నాం కానీ.. ఇప్పుడు జనాభా నిర్వహణ అంటున్నామని అన్నారు. తిరిగి ఉమ్మడి కుటుంబాలు రావాలని.. దాని కోసం ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని అన్నారు. పెద్ద కుటుంబాలను ప్రోత్సహించే విధంగా పథకాలు తీసుకువస్తామని.. పాపులేషనే మనకు ఒక పెద్ద ఆస్తి అని అన్నారు చంద్రబాబు. ఇప్పుడు చాలా దేశాల్లో వయసు మళ్ళిన వారే అధికంగా ఉన్నారని.. ఇప్పటి నుంచి భావి తరాల భవిష్యత్ కోసం, జనాభా నిర్వహణ కోసం అందరు సహకరించాలని అన్నారు చంద్రబాబు.

## రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్



**న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది.. ఈ క్రమంలోనే.. రేవంత్ సర్కార్.. కొత్తగా మంజూరైన వారికి రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్ చేసింది. ఈ నెల 14న తుంగతుర్తిలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 2.4 లక్షల కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సీఎం రేవంత్ చేతుల మీదుగా ఈ నెల 14న జరుగనుంది. దీంతో తెలంగాణలో 11.3 లక్షల మంది పేదలకు లబ్ధి చేకూరనుంది. వీటితో రేషన్ కార్డుల సంఖ్య తెలంగాణలో 94.72 లక్షలకు చేరింది.

కొత్త రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం కీలక ప్రకటన చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తుంగతుర్తిలో ఈ నెల 14న కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

అయితే.. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం జరుగుతుందని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎప్పుడైనా తెల్లరేషన్ కార్డులు ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే 13 వేల కోట్లతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు.

కాగా.. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం తుంగతుర్తితోపాటు.. రాష్ట్ర వ్యాప్తంగా అదే రోజు ప్రారంభం కానుంది.. ఆయా జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే.. కొత్తగా రేషన్ కార్డు కోసం అప్లై చేసిన వారికి కూడా అధికారులు పూర్తి స్తాయి పరిశీలన అనంతరం మంజూరు చేస్తారని పేర్కొంటున్నారు

## త్వరలోనే రోహిత్ వేముల చట్టం



**న్యూస్ డెస్క్,11 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు నియామకాన్ని పునరాలోచన చేయాలని సంచలన వ్యాఖ్యలు చేశారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. దళితులు, గిరిజనులను వేధించిన వారికి బీజేపీ ఉన్నత పదవులు ఇస్తుందనే దానికి తెలంగాణ అధ్యక్షుడిగా రామచందర్ రావు నియామకమే ఉదాహరణ అంటూ భట్టి విమర్శలు చేశారు.

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..'హెచ్‌సీయూలో రోహిత్ వేముల ఆత్మహత్యకు రామచందర్ రావు కారణం. ఆయనకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవితో రివార్డు ఇచ్చారు. బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు నియామకాన్ని పునరాలోచన చేయాలి. రోహిత్ వేముల ఆత్మహత్యకి కారణమైన సుశీల్ కుమార్‌కి ఢిల్లీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం ఇచ్చారు. ఇది వ్యవస్థాగత హత్య. ఏబీవీపీ నాయకులతో కలిసొచ్చి రామచందర్ రావు ధర్నా చేశారు.

ఢిల్లీ నుంచి రామచందర్ రావు పెద్ద ఎత్తున ఒత్తిడి చేసి రోహిత్ వేములను డిస్మిస్ చేయించారు. దేశ ద్రోహం కేసులు పెట్టించారు. ఈ వేధింపులకు వ్యతిరేకంగా రోహిత్ వేముల చట్టం తీసుకురావాలని రాహుల్ గాంధీ ఆదేశించారు. రోహిత్ వేముల కేసును రీ ఓపెన్ చేస్తున్నాం. కోర్టు అనుమతి కోసం అభ్యర్థన పెట్టాం. దోషులకు తగిన శిక్షలు పడాలి. ప్రతీ ఒక్కరూ ఆత్మగౌరవంతో బతికే పరిస్థితి ఉండాలి. వివక్ష ఉండకూడదు' అంటూ వ్యాఖ్యలు చేశారు.

మరోవైపు.. ఎస్సీ సెల్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్ మాట్లాడుతూ..'రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన వారికి బీజేపీ రివార్డులు ఇస్తోంది. రామచందర్ రావుకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఇచ్చింది. బీజేపీ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను పక్షపాతంతో ఫెయిల్ చేస్తున్నారు అని సంచలన ఆరోపణలు చేశారు.

పవర్ షేరింగ్ ఏమీ లేదు: మల్లు భట్టి విక్రమార్క

బీఆర్ఎస్ నేతల మాటలు మితిమీరిపోయాయని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, అదే సమయంలో జనాల్లోకి కూడా వెళ్లడం లేదని భట్టి విక్రమార్క తెలిపారు.తమ ప్రభుత్వంలో అంతా కలిసికట్టుగా పనిచేస్తున్నారని, ఇక్కడ పవర్ షేరింగ్ అంటూ ఏమీ లేదని మల్లు తెలిపారు. అందరం కలిసి టీమ్ వర్క్‌గా పనిచేస్తున్నామన్నారు.

'రెండు లక్షలు దాటిన వారికి రుణమాఫీ చేయొద్దన్నది విధాన నిర్ణయం. రేషన్ కార్డు ఆధారంగానే కుటుంబంలో రుణ మాఫీ. సన్నం బియ్యం సక్సెస్ అయ్యింది. మహిళలకు ఉచిత బస్సుకు మంచి స్పందన ఉంది. ఫోర్త్ సిటీ పనులు జరుగుతున్నాయి. మూసి సుందరీకరణ ఈ ప్రభుత్వం హయంలో పూర్తి అవుతుంది.

రీజినల్ రింగ్ రోడ్డు కూడా వస్తుంది. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చేది లేదు. సిగాచి ప్రమాదం పై విచారణ కు ఆదేశించాము. ఇటీవల జరిగిన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో ఖర్గే,కేసి వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల పూర్తి సంతృప్తితో ఉంది' అని మల్లు తెలిపారు.

# త్రివేణి లో వరల్డ్ పాపులేషన్ డే అవగాహన కార్యక్రమం



**ఖమ్మం ఎడ్యుకేషన్, 11 జులై (కెరటం న్యూస్):** ప్రపంచ జనాభా దినోత్సవంను ఈరోజు త్రివేణి స్కూల్లో విద్యార్థిని విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. జనాభా పెరగటం పట్ల ప్రజలు ఎదుర్కొంటున్న, ఎదుర్కోబోతున్న సమస్యలను మరియు వాటి పరిష్కారాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి త్రివేణి డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం ద్వారా, ఐక్యరాజ్యసమితి జనాభా సంబంధిత సవాళ్లను పరిష్కరించడం, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం యొక్క ప్రపంచ ప్రాముఖ్యతను హైలైట్ చేయాలని కోరుకుంటుంది. కాలక్రమేణా, ప్రపంచ జనాభా దినోత్సవం దృష్టి జనాభా వృద్ధి నుండి మాతృ ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, కుటుంబ నియంత్రణ వంటి విస్తృత సమస్యల వైపు మళ్లింది. మానవ హక్కులు, ముఖ్యంగా పునరుత్పత్తి హక్కులు, ఎంపికల గురించి మాట్లాడటానికి ప్రపంచ జనాభా దినోత్సవం ఒక వేదికగా మారింది అని తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా జనాభాకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవంను జరుపుకుంటారు. ప్రపంచ జనాభా 1987 జూలై 11న 5 బిలియన్లకు చేరుకున్న రోజును 'ఫైవ్ బిలియన్ డే'గా గుర్తించారు. ఈ సంఘటన నుంచి స్ఫూర్తి పొంది, ప్రపంచ బ్యాంక్‌లో సీనియర్ డెమోగ్రాఫర్ అయిన డాక్టర్ కె.సి. జకారియా ఈ సందర్భాన్ని ప్రపంచ జనాభా దినోత్సవంగా గుర్తించాలని ప్రతిపాదించారని ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా స్కూల్ లోని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ మరియు డ్రాయింగ్ కాంపిటీషన్లను నిర్వహించారు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఉత్సాహంగా వన మహోత్సవం

### మొక్కలు నాటిన చిట్టి చేతులు

### ఆకట్టుకున్న వన మహోత్సవ అవగాహన ర్యాలీ



**ఖమ్మం ఎడ్యుకేషన్, 11 జులై (కెరటం న్యూస్):** పర్యావరణాన్ని పరిరక్షించాలని కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలని సందేశం ఇస్తూ స్థానిక స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు శుక్రవారం వన మహోత్సవాన్ని బాధ్యతాయుతంగా, ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో , పాఠశాల మైదానంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా పాఠశాల విద్యార్థులు తమ చిట్టి చేతులతో పలు రకాల మొక్కలను నాటారు.తాము వివిధ రకాలుగా సేకరించిన మొక్కలను ప్రత్యేకంగా గుంతలు తీసి ఆ గుంతల్లో పూల మొక్కలు, పండ్ల మొక్కలు , ఆయుర్వేదం మొక్కలు , భవిష్యత్తులో నీడనిచ్చే మొక్కలను ఆనందోత్సవాలతో నాటారు.తొలుత పలు డివిజన్లో ,నగర పుర వీధులలో పాఠశాల చిన్నారులు వన మహోత్సవ అవగాహన ర్యాలీ ఉల్లాసంగా నిర్వహించారు. చేతిలో పలు రకాల సందేశాలను ఇచ్చే ప్ల కార్డులను చేత పూని పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. వన సంరక్షణ మన సంరక్షణ , నేచర్ కన్స్ట్రక్ట్ టీచెస్ యూ టు గ్రో, వృక్షో రక్షతి రక్షితః, చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, వనాలు ఉంటేనే జనాలకు భవిష్యత్తు తదితర నినాదాలు ఉన్న ప్ల కార్డులతో ర్యాలీ అందరినీ ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ భూమి మీద బ్రతికే మానవులతోపాటు అన్ని జీవులు ప్రాణ వాయువుతోనే జీవనం కొనసాగిస్తున్నాయని, ఆ ప్రాణవాయువును మనకు చెట్ల ద్వారానే వస్తున్నదని అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లు అయ్యేంతవరకు సంరక్షించాలని తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు తమ పుట్టినరోజున తప్పనిసరిగా ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు సమాజంలోని ప్రతి ఒక్కరూ వన మహోత్సవాన్ని నిర్వహించి మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిరుపేద ఇంజనీరింగ్ విద్యార్థినికి లయన్స్ క్లబ్ చేయూత

## రూ.15 వేల ఆర్థిక సహాయం చేసిన ఖమ్మం జిల్లా యూనిట్

## కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని నివేదిత



**ఖమ్మం టౌన్, 11 జులై (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన చెరుకూరి లలిత సాంబమూర్తి దంపతుల కూతురు చెరుకూరి నివేదిత ఇంజనీరింగ్ విద్య ఖర్చుల నిమిత్తం ఖమ్మం లయన్స్ క్లబ్ ఆపన్న హస్తం అందించింది. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కే జగదీష్ బాబు లైన్స్ క్లబ్ అధ్యక్షులుగా ఇటీవల నూతనంగా ఏర్పడిన కమిటీ తన ప్రస్థానంలో మొట్టమొదటి కార్యక్రమంగా నిరుపేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందించింది. ఈ మేరకు శుక్రవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఖమ్మం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నగదును సదరు విద్యార్థినికి అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కే జగదీష్ బాబు, ఎం దుర్గా నాగేశ్వరరావు, జోనల్ చైర్మన్ డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, ట్రెజరర్ కృష్ణమూర్తి తదితరులు మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటుందని వారు తెలిపారు. ఎవరు ఏ కష్టంలో ఉన్నా తన వంతుగా లయన్స్ క్లబ్ చేయూత అందించి ఆయా కుటుంబాలకు అండగా నిలుస్తుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా తనకు ఆర్థిక సహాయం చేసి తన ఇంజనీరింగ్ విద్య అభివృద్ధికి సహకారం అందించిన లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులకు చెరుకూరి నివేదిత తన కృతజ్ఞతలు తెలిపారు. తన ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్న వేళ లయన్స్ క్లబ్ అండగా నిలిచిందని నివేదిత కృతజ్ఞతాపూర్వకంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లయన్ కె.విశ్వేశ్వర రావు, వేముల హనుమంతరావు కొల్లూరి కృష్ణమూర్తి, డి పూర్ణచంద్రరావు, లయన్ కె వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

**లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంజనీర్స్ డే**

**ఇద్దరు విశ్రాంత ఇంజనీర్లకు సన్మానం..**

**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్**

లయన్స్ క్లబ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా తెలంగాణ ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కే జగదీష్ బాబు, కార్యదర్శి ఎం దుర్గా నాగేశ్వరరావు, జోనల్ చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు, తదితర సీనియర్ లయన్స్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఖమ్మం లయన్స్ క్లబ్ యూనిట్లో లయన్స్ గా ఉన్న సీనియర్ సభ్యులు పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ గా పనిచేసిన వేముల హనుమంతరావు, మేజర్ ఇరిగేషన్ ఎన్ఎస్పీలో టెక్నికల్ ఆఫీసర్ గా పని చేసిన కొల్లూరి కృష్ణమూర్తిని ఖమ్మం లయన్స్ క్లబ్ యూనిట్ సభ్యులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇంజనీర్స్ డే సందర్భంగా విశ్రాంత ఇంజనీర్లను సన్మానించుకోవడం గొప్ప విషయం అన్నారు. సమాజానికి ఇంజనీరింగ్ అద్భుతాన్ని అందించి మెరుగైన సమాజం కోసం కృషి చేసిన ఇంజనీర్లను సత్కరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.



# మల్బరీ సాగు లాభాలు భాగు



**ఖమ్మం టౌన్, 11 జులై (కెరటం న్యూస్):** మల్బరీ సాగు తో నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చునని, మల్బరీ సాగు సాగు లాభదాయకమని పట్టు పరిశ్రమ డిప్యూటీ డైరెక్టర్ ముత్యాలు తెలిపారు. కామేపల్లి మండలం లోని లింగాల గ్రామమంలో రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన రైతు సదస్సులో పాల్గొని ఈ విధంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు శ్రీ రాంరెడ్డి గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడుతూ, ప్రభుత్వం కలిపిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరినారు. డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ముత్యాలు మాట్లాడుతూ, సంప్రదాయ పంటలు కాకుండా మల్బరీ సాగు సాగు ఒక సాఫ్ట్ వేర్ ఉద్యోగి లాగా నెల నెల ఆదాయం వస్తుందని, మల్బరీ సాగు సాగులో చేపట్టవలసిన చర్యలను, ప్రభుత్వం అందించే రాయితీ లను వివరించారు. రైతులందరు లాభదాయకమైన మల్బరీ సాగు సాగు చేపట్టాలని మొక్కల పెంపకం కి మరియు డ్రిప్ పరికరాలను ప్రభుత్వం రాయితీ పై సరఫరా చేస్తుందని తెలియచేశారు. ఈ కార్యక్రమం లో డిజిటల్ గ్రీన్ ఇండియా వారు గోపాల్ రెడ్డి గారి చేతుల మీద గా మట్టి నమూనా కిట్టు ని వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించారు. ప్రతి కిట్ ద్వారా 50 మంది రైతుల భూ పరీక్ష చేయవచ్చు, కామేపల్లి 6 క్లస్టర్స్ కి ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన అధికారి ఆకుల వేణు, తార దేవి మండల వ్యవసాయ అధికారి, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణి మరియ రైతులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు రైతన్నకు మేలు



**ఖలీల్ పాషా, కెరటం న్యూస్ ప్రతినిది**. ఆయిల్ పామ్ తోటలు సాగు లాభదాయకమని పట్టు పరిశ్రమ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ముత్యాలు తెలిపారు. కామేపల్లి మండలం లోని పండితాపురం గ్రామమంలో రైతు మేకల మల్లి బాబు వ్యవసాయ భూమిలో "ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ప్రోగ్రాం" క్రింద ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభించినారు. సంప్రదాయ పంటలు కాకుండా వైవిధ్యమున్నపంటలు అనగా కూరగాయలు, పండ్లు, మల్బరీ సాగు మరియు ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తూ లాభాలు గడించాలని కోరినారు. మల్బరీ సాగు, కూరగాయల సాగులో చేపట్టవలసిన చర్యలను, ప్రభుత్వం అందించే రాయితీ లను వివరించారు. రైతులందరు లాభదాయకమైన ఆయిల్ పంట సాగు చేపట్టాలని మొక్కల పెంపకం కి మరియు డ్రిప్ పరికరాలను ప్రభుత్వం రాయితీ పై సరఫరా చేస్తుందని తెలియచేశారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన అధికారి ఆకుల వేణు, మండల వ్యవసాయ అధికారి తార దేవి, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రావణి మరియ రైతులు పాల్గొన్నారు.

## మత్స్య రైతుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

## అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

### జాతీయ మత్స్య రైతుల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్



**ఖమ్మం బ్యూరో, 11 జులై (కెరటం న్యూస్):** మత్స్య రైతుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మత్స్య రైతుల సాధక బాధకాలను సుదీర్ఘంగా చర్చించారు. మత్స్య రైతులకు భీమా, కిసాన్ క్రెడిట్ కార్డు మంజూరు, ఇతర సదుపాయాల కల్పన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. భారతదేశంలో 3 సంవత్సరాలకు సరిపడా ఆహార ఉత్పత్తుల నిలువ సామర్థ్యం కలిగి ఉన్నామని అన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని యువత కూడా రైతాంగం వైపు ఆసక్తి చూపాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శివ ప్రసాద్, సంబంధిత అధికారులు, మత్స్య రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి : ఏపీడీ శ్రవణ్ కుమార్



**నల్లగొండ ,11 జూలై (కెరటం న్యూస్):** మహిళలు స్వశక్తితో ఎదగడానికి ప్రభుత్వం అందిస్తున్న శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీడీ శ్రవణ్ కుమార్ అన్నారు. శుక్రవారం నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామంలో రుణాలు పొంది మహిళలు నిర్వహిస్తున్న యూనిట్లను ఆయన పరిశీలించారు. కారం మిల్లు, కిరాణం, స్టోన్ పై ఆర్ట్ యూనిట్లను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి, సకాలంలో రుణాలు చెల్లించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎల్ ఎం సభ్యులు సలీం కుమార్, ఎంపీడీఓ సిరిపురం వెంకట్‌రెడ్డి, ఏపీఎం వినోద, సీసీలు నరసింహ, అంజయ్య, శారద, శైలజ, లక్ష్మమ్మ, ధనమ్మ, హిమబిందు పాల్గొన్నారు.

# మూడు బంగారు పతకాలు సాధించిన గారపాటి సూర్య

## మాజీ ఎంపీ నామ అభినందనలు

## గారపాటి సూర్య చదువుల్లో ఘనాపాటి - మాజీ ఎంపీ నామ



**హైదరాబాద్ బ్యూరో, 11 జులై (కెరటం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, మాజీ దిశా కమిటీ సభ్యులు గారపాటి సూర్యనారాయణ (సూర్య) విద్యారంగంలో అరుదైన ఘనత సాధించారు. 2020 సంవత్సరానికి గాను కాకతీయ యూనివర్సిటీలో టాపర్‌గా నిలిచిన సూర్య, ఇటీవల జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో మూడు బంగారు పతకాలను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు హైదరాబాద్ లో బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావును తన కార్యాలయంలో గారపాటి సూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. సూర్య సాధించిన విజయం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు గర్వకారణమని, చదువు ద్వారా యువత ఎంత ఉన్నత స్థాయికి చేరగలరో సూర్య సాధించిన విజయం మంచి ఉదాహరణ అని ప్రశంసించారు. గారపాటి సూర్య చదువుల్లో ఘనాపాటి అని పేర్కొంటూ మూడు బంగారు పతకాలను నామ తన చేతుల మీదుగా మరోసారి సూర్య మెడలో వేసి, అభినందన పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చదువుతో పాటు సేవా దృక్పథం కలిగి ఉన్న యువకుడిగా సూర్యను అభివర్ణించారు. సూర్య విద్యార్థతలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి అన్నారు. తన లాగే ఓ సామాన్య రైతు కుటుంబం నుండి వచ్చిన సూర్య చిన్న వయసులోనే గ్రామ స్థాయిలో నాయకత్వ బాధ్యతలు చేపట్టి, ఉప సర్పంచ్‌గా ప్రజలకు సేవలు అందించటం తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారని, గతంలో పదిహేడవ లోక్ సభ లో ఎంపీ గా ఉన్నప్పుడు సూర్య దిశా కమిటీ సభ్యునిగా మందలపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేసారని గుర్తు చేసుకున్నారు. గారపాటి సూర్య విద్యపై ఉన్న శ్రద్ధ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతోనే ఈ స్థాయికి ఎదగగలిగారని నామ అన్నారు. తన విద్యను సమాజానికి ఉపయోగపడేలా మలచుకోవాలని ఆశయంతో ముందుకు సాగుతున్న సూర్య ఇప్పటికే పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు కంప్యూటర్స్ లో రెండు, ఎలక్ట్రానిక్స్, న్యాయశాస్త్రం లో ఒక్కోటి చొప్పున నాలుగు డిగ్రీలు పూర్తిచేసి ప్రస్తుతం న్యాయశాస్త్రంలో డాక్టరేట్ చేయడం కోసం పరిశోధనలు కొనసాగిస్తున్నానని నామకు తెలిపారు. నామ మాట్లాడుతూ...ఈవిధంగా గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన యువత విద్య, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ఈస్థాయికి ఎదగడం అందరికి ప్రేరణనిచ్చే విషయం అని నామ అన్నారు. ఉమ్మడి జిల్లాలో యువతకు సూర్య ఒక మార్గదర్శకంగా నిలవాలన్నారు. సూర్య మాట్లాడుతూ... తనకి ఈ గుర్తింపు కేవలం తన వ్యక్తిగత శ్రమ వల్ల మాత్రమే కాదు, తన కుటుంబం, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజల మద్దతుతో సాధ్యమైందన్నారు. తనకి మార్గదర్శకుడిగా ఉన్న నామ గారితో భవిష్యత్ లో సేవా కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉండాలను కుంటున్నాను అని చెప్పారు. గారపాటి సూర్య ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ విద్యతో పాటు తన సేవా దృక్పథాన్ని కొనసాగిస్తున్నారు. ఫీడ్ ద నీడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎందరో అభాగ్యులకు అండగా నిలుస్తూ వారి ఆకలి తీరుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టిన చదువు ద్వారా సుదూర గమ్యాలను చేరగలమన్న సందేశాన్ని సూర్య విజయగాథ అందిస్తున్నది, నామ ఆశీస్సులతో సూర్య మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

# ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి



**వైరా, 11 జులై (కెరటం న్యూస్):** ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం వైరా రిజర్వాయర్ రూప శిల్పి మీర్ అలీ నవాజ్ జంగ్ బహుదూర్ 148 జయంతి సందర్భంగా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్ లో రైతులు మీర్ అలీ నవాజ్ జంగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు,ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ ఆయకట్టు లో వరి నాట్లుకు అవసరమైన సాగు నీరు విడుదల చేయాలి అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ఏడు లక్షల ఎకరాల సాగునీటి అవకాశం ఉన్న సీతారాం ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు 100 సంవత్సరాల నాడే రైతులు అవసరాలు నిమిత్తం త్రాగునీటి అవసరాల నిమిత్తం మీరాలి నవాజ్జన్ హైదరాబాద్ సంస్థానంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి తెలంగాణ కాటన్ గా పేరుగాంచారని అన్నారు సీతారామ వైరా రిజర్వాయర్ అనుసంధానం రాజీవ్ లింకు కెనాల్ ద్వారా సంవత్సర కాలమైన గోదావరి జలాలు రాలేదని ప్రత్యామ్నాయ మార్గాల్లో గోదావరి జలాలను వైరా రిజర్వాయర్ కు తరలించాలని కోరారు. పట్టణ కార్యదర్శి చింత నిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ లో 17 అడుగుల నీటిమట్టం ఉందని, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వరద నీరు వస్తుందని వైరా రిజర్వాయర్ ఆయకట్టు లో వరి సాగు దము చేసి వడ్లు చలే విధానం ఎక్కువ ఉందని వెంటనే సాగు నీరు పూర్తిస్థాయిలో అందించాలి అని కోరారు, అనంతరం ఇరిగేషన్ అధికారులు కు ప్రదర్శన గా వెళ్ళి వినితి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో, పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, పైడిపల్లి సాంబశివరావు, సంక్రాంతి నర్సయ్య, కురుకుంట్ల శ్రీనివాసరావు, హరి వెంకటేశ్వరరావు, సంక్రాంతి పురుషోత్తం, చింత నిప్పు చంద్రరావు, నల్లమల కోటేశ్వరరావు, వడ్లమూడి మధు , పాసంగులపాటి చలపతిరావు, మాడపాటి వెంకట్, మాడపాటి రామారావు, మచ్చా కృష్ణమూర్తి, కామినేని రవి, చిత్తారు మురళి, యనమద్ది రామకృష్ణ, అమరనేని కృష్ణ, గోడ్ల లక్ష్మయ్య, మేడురి కృష్ణ మూర్తి, శీలం శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మా దేశానికి రండి.. పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం బీసీసీఐకి శ్రీలంక విజ్ఞప్తి!




**స్పోర్ట్స్ న్యూస్ ,11 జూలై (కెరటం న్యూస్):**బంగ్లాదేశ్‌తో ఆగస్టులో జరగాల్సిన పరిమిత ఓవర్ల సిరీస్‌లు రైద్దైన నేపథ్యంలో భారత క్రికెట్ జట్టు తమ దేశానికి రావాలని శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) బీసీసీఐని కోరింది. అదే ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడేందుకు శ్రీలంక పర్యటనకు రావాలని ఎస్ఎల్‌సీ.. బీసీసీఐకి లేఖ రాసినట్టు బోర్డు వర్గాల వినికిడి. దీనిపై బోర్డు ఇంకా స్పందించలేదు. ఒకవేళ బీసీసీఐ గనక ఈ ప్రతిపాదనకు సరే అంటే.. అభిమానులు భారత క్రికెట్ దిగ్గజాలైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటను వీక్షించే అవకాశం ఉంటుంది.

# ‘రామాయణ’.. హనుమంతుడి పాత్ర 15 నిమిషాలే!



మూవీ న్యూస్, 11 జులై (కెరటం న్యూస్): బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారి రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్న విషయం తెలిసిందే. ‘రామాయణ’ పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. ఇటీవల ఇందులోని పాత్రలను పరిచయం చేస్తూ వీడియోను విడుదల చేయగా దానికి మంచి ఆదరణ లభించింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇందులో హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ నటుడు సన్నీ దేవోల్ కనిపించనున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండు పార్టులుగా రానున్న ఈ సినిమా మొదటిభాగంలో ఆయన పాత్ర నిడివి చాలా తక్కువగా ఉండనున్నట్లు సమాచారం. 15 నిమిషాలు మాత్రమే కనిపిస్తారట. రెండో భాగంలో ఆయన పాత్రే కీలకం కానున్నట్లు తెలుస్తోంది. పార్ట్ 2లో ఎక్కువసేపు కనిపించనున్నారట. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ ఈ వార్త మాత్రం సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. జటాయువు పాత్రకు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇవ్వనున్నట్లు సమాచారం. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమా మొదటిభాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది. రెండో భాగం 2027లో విడుదల కానుంది.

# విశాఖలో ‘అల్లు అర్జున్’ మల్టీప్లెక్స్ పనులకు శ్రీకారం..




**మూవీ న్యూస్, 11 జులై (కెరటం న్యూస్):** విశాఖపట్నంలోని ఇనార్బిట్ మాల్ కొద్దిరోజుల్లో ఓపెన్ కానుంది. విశాఖ నగరానికి సరికొత్త అట్రాక్షన్ ఇనార్బిట్ మాల్ కానుంది. ఇనార్బిట్ మాల్ నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు ఆ యాజమాన్యం చకచకా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే ఇనార్బిట్ మాల్లో ఆసియన్ అల్లు అర్జున్ మల్టీ ప్లెక్స్ పనులు తాజాగా ప్రారంభించారు. 2023లోనే 13 ఎకరాల్లో విశాలంగా ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి పునాది పడింది. దక్షిణాదిలోనే విశాఖలో నిర్మించే మాల్ అతిపెద్దది.

జులై 10న ఆసియన్ సునీల్, అల్లు అరవింద్లతో పాటు వారి టీమ్ విశాఖపట్నం చేరుకుంది. ఇనార్బిట్ మాల్లో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పది నెలల్లోనే పనులు మొత్తం పూర్తికావాలని ప్రణాళికలు వేశారు. ఇప్పటికే థియేటర్లో ఉండాల్సిన ఇంటీరియర్ డిజైనర్లను అల్లు అర్జున్ ఫైనల్ చేశారట. మల్టీ ప్లెక్స్కు కావాల్సిన ఫర్నీచర్ అంతా విదేశాల నుంచే తెప్పిస్తున్నారు. విశాఖలోనే అత్యంత లగ్జరీ థియేటర్ ఉండాలని వారు ప్లాన్ చేస్తున్నారు. మొత్తం 8 స్క్రీన్స్ ఈ మల్టీప్లెక్స్ నందు ఉంటాయి. 2026 సమ్మర్లో ప్రారంభం కానుందని ప్రకటించారు. ప్రస్తుతం అల్లు అర్జున్ కు హైదరాబాద్ లో AAA మల్టిప్లెక్స్ ఉన్న సంగతి తెలిసిందే.

# ఓటీటీలోకి ‘కుబేర’.. అధికారికంగా ప్రకటించిన సంస్థ



**మూవీ న్యూస్, 11 జులై (కెరటం న్యూస్):** శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘కుబేర’. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం సినీప్రియుల్ని ఆకట్టుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జూలై 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గత కొన్ని రోజులుగా దీని ఓటీటీ విడుదలపై ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ.. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అమెజాన్ ఓ పోస్టర్ విడుదల చేసింది.